కనువిప్పు

ఆర్. [illegible]

పూజా మందిరంలో గంటలు గణ గణమని మ్రోగాయి. సీతాపతిగారు దేవుడి విగ్రహం ముందు హారతిపళ్ళెం ముమ్మారు తిప్పి నేలమీద వుంచారు. చెంపలు వాయించుకుని సాష్టాంగ నమస్కారం చేశారు.

'ఆపద్బాంధవా!... శ్రీరామచంద్ర మూర్తీ! నిన్నే నమ్ముకున్న నన్ను ఇంకా ఎంతకాలం పరీక్షిస్తావు తండ్రీ!'

సామాన్యంగా భక్తుల నోటంట వచ్చే మాటలైనా ఆ పలుకులవెనక ఏదో విషాద గీతం ధ్వనించింది. శ్రీరాముడు మందహాసం చేశాడు.

చిన్నప్పటినుండీ సీతాపతిగారు భక్తిపూరితమైన వాతావరణంలో పెరిగాడు. ఆయన తండ్రి వూరువిడిచి వెళ్ళి వుద్యోగం చేయవలసిన అవుసరం లేకుండా పొలాల మీద మంచి రాబడివచ్చేది. కాలుమీద కాలు వేసుకుని జీవించారు. ఆయన దైవభక్తి పరాయణుడు. ఉదయం నాలుగు గంటలకు లేచి దగ్గర్లోవున్న కాలవలో స్నానం చేసి వచ్చి అయిదు గంటలకు పూజా మందిరంలో అడుగుపెడితే భక్తిలో లీనమైపోయి ఏడుగంటల దాకా బయటికి వచ్చేవారు కారు. ఆయన అడుగుజాడల్లో పెరిగిన సీతాపతిగారూ అంతే—రైల్వేలో వుద్యోగం చేసినా ఆయన భావాలుకాని–ఆచార వ్యవహారాలు కాని మారలేదు.

కాని ఆయన ఆశించినందుకు విరుద్ధంగా శ్రీరాముడు చల్లటి తుషార బిందువుల్ని వర్షింపలేదు. అందుకు కారణం పెళ్ళీడుకొచ్చిన ముగ్గురు కూతుళ్ళు - పెద్దదానికి దరిదాపు ఇరవై ఏళ్ళుంటాయి. సంఘంలో నలుగురూ చేసే విమర్శకు తట్టుకోలేక సతమతమవుతున్నారు.

ఆయన భార్య వెండిగ్లాసు నిండా కాఫీ తీసుకొచ్చి స్టూలుమీద వుంచింది.

'ఇంకా నిద్రమత్తు వదల్లేనట్టే వుంది! పాఖర్మ కాకపోతే దానికి తగిన సంబంధాలు రాకపోతాయా! అయినా మీకు చీమ కుట్టినట్టైనా లేదు. అస్తమానం దేవుడు దేవుడు! అంతే! గొంతెమ్మ కోరికలు మానుకుని ఏదో ప్రాప్తం అంటూ ఒకడి మెడకు కట్టేయక ఏమిటీ అపవాదు నాకు? చెప్పి, చెప్పి నా నోరు పడిపోతోందికాని...' అంటూ అందుకుంది.

ఆయనకు కాఫీ ఎలాదిగుతుంది!

'తెల్లవారగానే మొదలెట్టావు దండకం! ఇంక చాలించు... నేనూ చెప్పలరిగేటట్టు తిరుగుతూనే వున్నాను. ఇలాంటి సీగ్రో

భగ్న భాండం

చిత్రకారుడు: సిహెచ్. రాధేమోహన్.

★ కనువిప్పు ★

ళ్లాంటి పిల్లల్ని ఎవరు చేసుకొంటాడు? ఓపిక పట్టాలిమరి' అంటూ కోపాన్ని అణచి పెట్టుకోడానికి యత్నించాడు.

సీతాపతిగారి ఆలోచనలు మరోదనకు పరుగెత్తాయి. నిన్నరాత్రి కలలో ఆయనకు శ్రీరాముడు కనిపించి ఆయన్ని నిందిస్తూ ఏవిటేవిటో అన్నాడు. కళ్లవెంబడి అగ్నికణాలు రాలాయి. అందుకు తను చేసిన అపరాధం ఏవిటి? ఏనాడూ పూజచేయకుండా వుండలేదే!

బయట అరుగుమీద జోళ్ళచప్పుడు వినబడింది.

ఎవరో మెల్లిగా మాటాడు కుంటున్న ధ్వని.

'సీతాపతిగారూ!' అన్న పిలుపు-

ఆయన వెంటనే గుర్తు పట్టాడు—అది డాక్టరుగారి కంఠం.

సీతాపతిగారు బయటకొచ్చి వినయపూర్వకంగా నమస్కరిస్తూ 'ఓహో!... ఏవిటిది! త్రిమూర్తులు కలిసి వచ్చారు! దయచేయండి' అంటూ ఆహ్వానించారు.

'పెద్దబిరుదే యిచ్చారండోయ్!' అన్నారు ఆ వూళ్ళో మంచి పేరుగడించిన ప్లీడరుగారు.

ముగురూ లోపలకొచ్చి మూడు నెలల క్రితంకొన్న 'స్టీల్ ఏజ్' మంచంమీద కూర్చున్నారు. గౌరవానికి లోటులేకుండా మూడు వెండి గ్లాసుల్లో కాఫీ తీసికొచ్చి వాళ్ళ ముందర వుంచింది ఆయన భార్య.

'ఊరకరారు మహానుభావులు!' అంటూ సంభాషణకు నాందీ వాక్యం పలికారు సీతాపతిగారు.

'ఆ...మీకు తెలియని విషయమేమీ కాదనుకోండి. మీరు రిటైరు కాకపూర్వం ఓమాటు యీవూరు వచ్చినప్పుడు అనుకున్న మాటే. చూడండి!... ఈ చుట్టుపక్కల మనం సుమారు ఎనిమిదివేల మంది వున్నాం—కాని దైవ సందర్శనం కోసం మైలుదూరం పోవలసి వుంది. అదెంత బాధకరమైందో ఆలోచించండి!' అన్నారు డాక్టరుగారు. వెంటనే పూజారి సుబ్బన్న అందుకున్నాడు.

'అందుచేత మన జనుల్లో దైవచింతనాగా సన్నగిలుతోందంటే నమ్మండి. ఇది చివరకు మన వినాశానికే దారితీస్తుంది.'

నిజంకావచ్చు—అందుకని?' అని అడ్డు ప్రశ్న వేశారు సీతాపతిగారు.

'మరేంలేదు! చిన్న చిన్న నీటిచుక్కలు కలిస్తే సముద్రమవుతుందంటారు, అలాగే మనమంతా కలిసి దీక్షగా పూనుకుంటే ఓ బ్రహ్మాండమైన దేవాలయం నిర్మించవచ్చు.'

'అప్పుడది అందరికీ దగ్గరలో—సౌకర్యముగా వుంటుంది. మనలో ఒక విధమైన నూతన తేజస్సు ఉద్భవిస్తుంది.' అని సమర్థించారు ప్లీడరుగారు. సీతాపతిగారు డబ్బు విషయంలో నిక్కచ్చిగా వుంటారు. అది ఆయనలో లోపం కావచ్చు. మా నాన్ని ఏవిధంగా అన్వయించుకోవాలో అర్థంకాక ముగ్గురూ తికమకలాడారు.

'ఏవిటి ఆలోచిస్తున్నారు? మీ అభిప్రాయం ఏవిటి?'

'ఆ...ఏంలేదు. మనింటో దేవుడిపటం వుంచుకుని పూజచేస్తే చాలదా అని— ఇందుగల డందులేడను సందియము వలదన్నట్టు—అతను అన్నిచోట్లా వున్నాడు.'

పూజారి ఆయన్ని ముందుకు సాగనివ్వలేదు. నిజానికి ఆలయమంటూ వొకటి నిర్మితమైతే లాభంపొందేది సుబ్బన్న.

'నిజమే ననుకోండి—కాని అందరూ మీలాగ నిశ్చలభక్తితో దైవారాధన జరపగలరా? చంచలచిత్తుల్ని రుజుమార్గంలో వుంచటానికే దేవాలయాలు సృష్టింపబడ్డాయి. మనం అందరిబాగోగులు గమనించాలి.'

'అబ్బే!...మీ అభిప్రాయాన్ని నేను వ్యతిరేకిస్తున్నా ననుకోకండి. ఇంతకీ నావల నయ్యే పెద్దసాయం ఏముంది కనక!'

'అదేవిటి? అలా వెనకాడు తున్నారు? దేవుడి పెళ్ళికి అందరూ పెద్దలన్నారు. ఇందులో మీకూ బాధ్యతవుంది.'

రెండునిమిషాలు నిశ్శబ్దం.

'చూడండి!...వరప్రసాదరావుగారు మూడువేలు చందా వేశారు. మీవంతు—' అంటూ అసలు విషయం బయటపెట్టారు ప్లీడరుగారు.

'అమ్మో!...అంతా వేలమీద నడుస్తోందన్నమాట! ఆ చాయలకు వెళ్ళటానికే నాకు తాహతులేదు.'

'అబ్బే!...మీరే అలాగంటే ఎలా? మొన్ననే రిటైరయ్యారు. అరవై వేలదాకా ప్రావిడెంటుఫండు వచ్చింది. మీరిలా చిన్నచూపువేస్తే ఆలయ నిర్మాణం మాటల్లోనే వుండిపోతుంది.'

ఆతరవాత పావుగంటసేపు సంభాషణ జరిగింది. ముగ్గురూ కలిసి సామదానభేద దండోపాయాలు ప్రయోగించి ఆయనచేత పదిహేను వందలు చందా వేయించారు.

'చందా వేశాంకదా ఇంక మనబాధ్యత వదిలిందనుకోకండోయ్! మీ సంపూర్ణ సహకారం కావాలి.' అంటూ త్రిమూర్తులు సెలవుతీసుకున్నారు.

ఆయనకొకవంక బాధగానే వుంది. అయినా దైవకార్యానికని తృప్తిపడ్తున్నారు. ఒకవేళ ఇందుకే తన యిష్టదైవం నిన్నరాత్రి కన్నెర్ర చేసిందేమో!

'నాన్నా!...ఏంకూరలులేవు - ఇదుగో నంచీ. అమ్మ బజారుకెళ్ళి రమ్మంది.' అంటూ పెద్దకూతురు మాలతి ఆలోచనల్ని తుంచివేసింది.

మాలతివంక చూస్తుంటే కళ్ళు చెమ్మగిల్లాయి. స్త్రీకి - అందులోనూ యువతికి సౌందర్యాన్ని ప్రసాదించే ప్రతిలక్షణమూ ఆమెలో లోపించింది. మొదటిది శరీరచ్ఛాయ - అమావాస్యనాటి చీకటిలాంటిది. అందమనేది కళ్ళల్లో వుంటుందనుకుంటే అక్కడే శ్రీరాముడు అన్యాయం చేశాడు. మెల్లకన్ను ప్రసాదించాడు. ఆపరేషన్ చేసి సరిచేయమని శ్రేయస్కాములు సలహా యిచ్చారుకాని ఆయన భయపడి వూరుకున్నాడు. మూడోది అవయవ నిర్మాణం. మరో శరీరానికి వుద్దేశింపబడినదనుం - సన్నగా ములక్కాడల్లే వేలాడే చేతులు-ఏదో అర్థంకాని వ్యాధిచేత పీడింపబడుతూ వికసించని యౌవనం - పోనీ సహజమైన బారెడుజెడ వుందా అంటే అదీ లేదు. ఇలాంటి అమ్మాయికి సలక్షణమైన మొగుడు ఎలా దొరుకుతాడు? ఇందులో ఎవర్ని తప్పుపట్టి నిందించటం? ఆయనకు డబ్బు వుండి ఏంలాభం? మానవశక్తి కతీతమైనప్పుడు కనిపించని ఏ దేవుడిమీదో భారం వేయటం మానవనైజం-

సీతాపతిగారు ఏవో కూరగాయలు బేరమాడుతున్నారు.

'నమస్కారమండి!' అంటూ పలకరించాడు వీరభద్రం-

'ఏమోయ్!...కులాసా?'

వీరభద్రం ఎలిమెంటరీ స్కూలు ఉపాధ్యాయుడు. నలుగురికీ నమస్కారాలు పారేస్తూ ఎలాగో బతుకుతున్నాడు.

'ఏదో తమ దయవల్ల-విశేషించి మీతో ఒకమాట చెప్పాలనుకుంటున్నాను. సాయంత్రం అమ్మాయిని చూసుకోటానికి పెదపూడినుంచి వస్తున్నారు. అవుసరమైతే కబురంపుతాను. పెద్దలు మీరు దగ్గరవుంటే నాకెంతో బలంగా వుంటుంది. అదీకాక తమకు నా పరిస్థితులు కూలంకషంగా తెలుసు. నేనే యింటికి వద్దామనుకుంటుంటే మీరు ఎదురయ్యారు.' అంటూ వినయంగా నవ్వాడు.

'దానికేం భాగ్యం! తప్పకుండా ఒస్తాను' అన్నారు.

వీరభద్రం మాటలు తల్చుకుంటే ఆయనకు నవ్వొచ్చింది. అతని కూతురు చాలా బాగుంటుంది. చక్కగా సంగీతం పాడుతుంది. అట్టే చదువుకోకపోయినా తెలుగు పద్య కావ్యాలన్నీ చదువుతుంది. గజేంద్ర మోక్షంలో పద్యాలు తప్పు చెపుతూండగా ఆయనే స్వయంగా విన్నాడు. అలాంటి చక్కటి చుక్కకు సరైన భర్త దొరకటం తలకుమించినపనిగావుంది. అందుక్కారణం వీరభద్రం దరిద్రుడు కావటం – ఇటు తనకు సిరిసంపదలున్నాయి. కాని ఒక్కరికీ అందచందాలులేవు. 'దైవలీల' అంటే యిదే గామోలు! మరుక్షణం ఆయన మనోనేత్రం ముందు వో బ్రహ్మాండమైన దేవాలయం కనపడింది. గుడిగంటలు జయధ్వానాలుచేశాయి! హృదయం పులకరించింది. కళ్ళమ్మట నీళ్లు కారాయి.

* * *

సాయంత్రం నాలుగు గంటలు–

సీతాపతిగార్ని వెంటనే రమ్మని వీరభద్రం కబురు పంపాడు. సిల్కు చొక్కా తొడుక్కుని, జరీకండువా వేసుకుని ఠీవిగావెళ్లారు. వీరభద్రం ఆయన్ని ఆదరించి కూర్చోబెట్టాడు.

కాని...పెళ్లికొడుకునుచూడగానే కోటి శూలాలు గుండెలోంచి దూసుకుపోతున్నట్టనిపించింది. అతనే!...సరిగ్గా నెలరోజుల క్రితం తన కూతుర్ని చూసుకోటానికి వచ్చాడు.

డొక్కున్నట్లు – ఆముదం తాగినట్లు ముఖకవళికలు ప్రదర్శించాడు. మాలతిలాంటి అపురూప సుందరిని చూచినందుకు తనకు వారంరోజులవరకూ నిద్రపట్టదనిపరోక్షంగా ఎవరితోనో అన్నాడట. వీరభద్రం సీతాపతిగార్ని వంటింట్లోకి తీసుకుపోయాడు.

'చూడండి! అబ్బాయి వున్నత భావాలు కలవాడు. మంచి ఉద్యోగంవుంది. అతనికి అమ్మాయి నచ్చింది...కాని మా పరిస్థితులు మీకు తెలియనివికావు. నేను స్థితిమంతుడిని కాను. కనీసంవెయ్యిరూపాయలైనా కట్నం యివ్వాలని అంటున్నారు.'

ఇంతలో మధ్యవర్తి అక్కడకు వచ్చాడు.

'ఏమిటి ఇంకా ఆలోచన? ఇలాంటి సంబంధం భూప్రదక్షిణంచేసినా ఇంకమీకు లభ్యంకాదు. అతనికి తల్లీ తండ్రీ వుంటే పదివేలకు తక్కువ కాకుండా కట్నం అడుగుతారు–' అని హితబోధ చేశాడు.

వీరభద్రం అతనిమాటలు వినీవిననట్లువూరుకుండి 'అందుచేత మీరే అతనికి నచ్చచెప్పి కట్నం తగ్గించాలి. అయిదు వందలకు మించి కట్నం కానీకూడా యివ్వలేను. అదైనా తల్లకిందులా తపస్సుచేసి సంపాదించాలి.' అన్నాడు.

'నువ్వుచెప్పేది చిత్రంగా వుందయ్యా! అతను నామాట వింటాడా?'

'ఎందుకు వినడు? తగిన రీతిని మీరే చెప్పగలరు.'

సీతాపతిగారు యిరకాటంలో పడ్డారు. కట్నాలు పుచ్చుకోవటం అంత సమంజసం కాదనీ – చదువుకున్నవాడు కనక గుణగణాలకే ప్రాధాన్యం యివ్వాలని, వీరభద్రం కుటుంబం పరువు మర్యాదలు కలదని వుపదేశించారు.

'అంతయిదిగావుంటే నేనడిగే కట్నం మీరేయిచ్చి ఆయనకు సాయం చేయకూడదూ? మీరు మంచి స్థితిమంతులుగా!' అని నిర్మొహమాటంగా అనేశాడు పెళ్ళికొడుకు. సీతాపతిగారు కొయ్యబారిపోయి రెండు నిమిషాలు అలాగే నిలబడిపోయారు. తరువాత జరిగినదానికి సిగ్గుపడుతూ ఇంటికి తిరిగివచ్చారు.

ఆరాత్రికూడా శ్రీరాముడు కలలో కనిపించి కోపంగా ఏవేవో అన్నాడు. మర్నాడు ఉదయం కాఫీతాగి తిన్నగా వీరభద్రం యిల్లుచేరుకున్నారు.

'ఆఖరుకు ఏమయిందయ్యా?' అనడిగారు.

'ఏముందండి! సంబంధం చెయిజారిపోయినట్టే! అయినా ఈకాలంలో కట్నాలు లేకుండా ఎవరుచేసుకుంటారు?' అని నిట్టూర్చాడు వీరభద్రం.

'లోకపుతీరు అంతేననుకో!......నిన్న రాత్రంతా ఆలోచించాను. డాక్టరుగారూ వాళ్ళూ ఓ దేవాలయం నిర్మించాలని ప్రయత్నిస్తున్నారు. అందుకు నాచేత పదిహేను వందలు చందా వేయించారు. కాని మాధవసేవకంటే మానవసేవ గొప్పదన్నారు. బ్రహ్మాండమైన దేవాలయం నిర్మించారనుకో దానివలన సామాన్యుడికి ఒరిగేదేమిటి? ధర్మకర్తలు స్వామి సొమ్ము ఫలహారం చేస్తారు. పూజారి లాభం పొందుతాడు. అందుచేత ఆ పదిహేను వందలూ నీకిస్తాను – మీ అమ్మాయి పెళ్ళి దివ్యంగా జరిపించు–ఇవేళ ఆ వూరు వెళ్ళి అన్నీ స్థిరపర్చుకునిరా– ఆలస్యం చేయొద్దు.'

సీతాపతిగారి హృదయం ఎంత విశాలమైనదో అంచనావేయటానికి యత్నిస్తూ నోటమాటరాక వీరభద్రం అలాగే వుండిపోయాడు.

'ఈ సొమ్ము నేనిస్తున్నానని అనుకోకు – ఆ శ్రీరామచంద్రమూర్తి అనుగ్రహించాడనుకో–' అంటూ పదిహేను వందలూ యిచ్చారు.

'నిజానికి నీకాబోయే అల్లుడే నాకు చక్కటి సమాధానం యిచ్చి నాకన్ను తెరచాడు. నాకు చేతనైంది మంత్రోక్తమైన పూజ వొక్కటే!'

వీరభద్రం చెమ్మగిలిగిన కళ్ళతో కృతజ్ఞతాపూర్వకంగా ఆయనకు నమస్కరించాడు.

ఆరాత్రి కలలో శ్రీరాముడు నవ్వుతూ సీతాపతిగార్ని దీవించాడు. మాలతి పెళ్ళి కూడా వైభవంగా జరుగుతున్నట్లు కనిపించింది.

సీతాపతిగారు మాత్రం దాన్ని కలగా విశ్వసించలేదు. ★

జియోఫ్రీమేనర్స్ అండ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్, రిజిస్టర్డ్ వాడుకందారు.